క్లుప్తంగా

గరుడుబిల్లిలో నేత్రవైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యసిబ్బంది

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో నెల్లిమర్ల సెంచూరియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ బొద్దల కృష్ణవేణి ప్రారంభించారు. శిబిరంలో సుమారు వందమందికి ఆప్తాలమిక్ శ్రావణి కంటి పరీక్షలు చేసి, ఆరుగురిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ ప్రొఫెసర్‌లు అలనా, ఈశ్వర్, రిజిస్ట్రార్ పి.ఎస్.వి.రమణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొద్దల చిన్నం నాయుడు, ఎంపీటీసీ పాలూరి జోగమ్మ పాల్గొనగా, శిబిరంలో సేవలందించిన సిబ్బందికి సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జి.ఎస్.ఎన్.రాజు అభినందించారు.

19న మండల సర్వసభ్య సమావేశం

లక్కవరపుకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 19వ తేదీన ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.జ్ఞానేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధి కారులు హాజరు కావాలని కోరారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన



ఇంటింట కుళాయిలను పరిశీలిస్తున్న డీఈ పైడిరాజు, అధికారులు

వేపాడ: మండలంలోని చినగుడిపాల పంచాయతీ బోజంకివానిపాలెంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా చేపడుతున్న ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.ఆర్.వి.పైడిరాజు బుధవారం పరిశీలించారు. గ్రామంలో రూ.12 లక్షలతో జల జీవన్ మిషన్ పనులు 70 శాతం పూర్తయ్యాయని ఆయన చెప్పారు. మిగతా పనులు త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు ఫోన్‌లో డీఈ సూచించారు. ఆయన వెంట ఏఈ ఏ.దేవి, వర్క్ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్వేత, సర్పంచ్ రామునాయుడు, వలంటీర్ నాయుడు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న సీడీపీఓ ఉమ

శృంగవరపుకోట: బాల్యవివాహాలు దేశాభివృద్ధికి గొడ్డలి పెట్టని, అవి లేని వ్యవస్థ కోసం పని చేయాలని అధికారులు అంతా ముక్తకంఠంతో చెప్పారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీ ఎస్ పీఓ ఉమ అధ్యక్షతన 'బాల్యవివాహాలు-బాలల హక్కులు' అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. పీఓ మాట్లాడుతూ బాల్యవివాహాలతో ఆడపిల్లల జీవితాలు పాడవుతున్నా యని, వీటిని అంతా కలిసి అడ్డుకుందామని అన్నారు. ఎంపీడీఓ శేషుబాబు మాట్లాడుతూ గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ఎంఈఓ పి.సత్యనారాయణ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బాల్యవివాహాల నియంత్రణలో భాగస్వాములు కావాలని అన్నారు. వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల మానసిక, శారీరక వైకల్యం ఉన్న పిల్లలు పుడతారని, తల్లులకు ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేతనాల పెంపునకు తీర్మానం

శృంగవరపుకోట: స్థానిక మేజర్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రోజువారీ వేతనాలు పెంచేందుకు, పంచాయతీ పరిధిలోని దుకాణాల అద్దెలు తక్షణం యాభై శాతం పెంచేందుకు పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సంతోషికుమారి అధ్యక్షతన, పంచాయతీ కార్యనిర్వహణాధికారి పాత్రో నేతృత్వంలో పంచాయతీ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు గతం కన్నా తక్కువ వేతనంతో ఉన్న టెండర్ ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. ఈఓ బదులిస్తూ తక్కువ టెండర్ ఖరాలు చేయడమే తన విధి అని చెప్పడంతో సభ్యులు అంతా కార్మికులకు రోజువారీ వేతనం రూ.340 ఇచ్చేందుకు తాము అంగీకరిస్తామని, ఈ మేరకు తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపాలని పట్టుబట్టారు. శిథిలావస్థకు చేరిన పంచాయతీ దుకాణాలు కూలగొట్టి, కొత్త నిర్మాణాలు చేస్తామన్న ప్రతిపాదనలతో తొమ్మిదేళ్లుగా అద్దెలు పెంచక పంచాయతీ నష్టపోయిందని, అద్దెలు 50శాతం పెంచాలన్న ప్రతిపాదన ఉపసర్పంచ్ కుమార్ చేయగా సభ్యులు అంతా ఆమోదించారు. పలు సమస్యలపై చర్చించారు.

ప్రతి ఇంటికీ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



దత్తిరాజేరు: దాసుపేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గుర్ల: గోషాడలో ఓ కుటుంబానికి పథకాల లబ్ధిని వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: గతంలో ఎన్నడూ లేనివిధంగా అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమేనని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోషాడలో సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పథకాల ద్వారా కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే వాటిని ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా దీవించాలని కోరారు. కొన్ని కుటుంబాలకు అందించిన పథకాల లబ్ధి జాబితా కరపత్రాల్లో పథకాల వివరాలు లేకపోవడంతో సచివాలయ సిబ్బందిపై జెడ్పీ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, వైఎ స్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, బోళ్ల సుబ్రహ్మణ్యం, రౌతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే...

దత్తిరాజేరు: క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా గడప గడపకూ వస్తున్నామని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. మండలంలోని దాసుపేట గ్రామంలో బుధవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ పథకాలు అందుతున్నాయా లేదా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు ఇళ్లు మంజూరు చేయాలని కోరగా..ఇళ్ల మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు మంజూరు చేస్తున్నామని, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందిస్తున్నామని చెప్పారు. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పనిలేకుండా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు సిరిపురపు శంకరరావు, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఉప సర్పంచ్ గణపతి, గ్రామ పెద్దలు శ్రీనివాసరావు, నారాయణప్పడు పాల్గొన్నారు.



కొత్తవలస: వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పేదల సంక్షేమమే ధ్యేయం

కొత్తవలస: పేద ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, రాష్ట్రంలో నాలుగేళ్లుగా సంక్షేమ, సువర్ణపాలన సాగుతోందని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవల మేజర్ పంచాయతీ సచివాలయం-5 పరిధి రాజుపాత్రునిపాలెం గ్రామంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గడపగడపకూ వెళ్లి పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా పూర్తి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో అత్యవసర అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారానికి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున సీఎం జగన్ మంజూరు చేశారని చెప్పారు. వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ లెంక లక్ష్మి, పార్టీ నాయకులు ఎం.బాలరాజు, రంది అప్పలనాయుడు, కొట్యాడ శ్రీనివాసరావు, ఆతవ రమేష్,తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మద్దతుగా నిలవండి

అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు అంతా మద్దతుగా నిలవాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. 'జగనన్నే మా భవిష్యత్ - మాన మ్మకం నువ్వే జగన్' కార్యక్రమం చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఆరో రోజు బుధవారం సాగింది. గృహ సారథులు, సచివాలయకన్వీనర్లు, ప్రజాప్రతినిధులు,నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సర్వే చేసి ప్రజల అభిప్రాయాలు సేకరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనకు, గత టీడీపీ ప్రభుత్వం పాలనకు తేడాలను వివరించారు. ప్రజల అనుమతితో వారి ఇళ్లకు 'మానమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించారు.

– సాక్షి నెట్‌వర్క్



గుర్ల: గుర్లలో నిర్వహించిన కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



శృంగవరపుకోట: అమ్మపాలెంలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు



బొండపల్లి:గొట్లాంలో పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు తులసీరాం, పీఏసీఎస్ అధ్యక్షుడు రమణ



చీపురుపల్లి: చీపురుపల్లిలో పథకాల అమలుపై సర్వే చేస్తున్న నాయకులు బెల్లాన వంశీ కృష్ణ, తదితరులు



కొత్తవలస: రాజుపాత్రునిపాలెంలో ఓ ఇంటికి స్టికర్ అతికిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



బొండపల్లి: అంబటివలసలో పథకాలను వివరిస్తున్న ఎంపీటీసీ అప్పలనాయుడు, నాయకులు



దత్తిరాజేరు: విజయరాంపురంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు,సర్పంచ్ సింహాచలం



మెరకముడిదాం: మెరకముడిదాంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న నాయకులు, గృహసారథులు

సమస్యల పరిష్కారంపై దృష్టి

జామి: గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కడుబండితో పాటు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరయ్యారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులు, హౌసింగ్ నిర్మాణాల ప్రగతి, తదితర అంశాలపై ఆయాశాఖల అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ వాణిజ్యపంటల సాగును ప్రోత్సహించేలా రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూ చించారు. కొంతమంది రైతులను ఎంపికచేసి వారితో ఆయిల్‌పామ్, చెరకు,తదితర పంటలు సాగుచేయించాలని, అవసరమైతే ఎమ్మెల్యేతో పాటు తాను కూడా వచ్చి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ ఐసీడీఎస్ సిబ్బంది సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వడంలేదని, మిషన్ వాత్సల్య పథకంపై కనీస సమాచారం ఇవ్వక పోవడంతో అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోతు న్నారని మండిపడ్డారు. జెడ్పీటీసీ గొర్లె సరయు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా మండలంలోని పలు గ్రామీణ రహదారులపై భారీ వాహనాలు తిరగడం వల్ల రోడ్లు పూర్తిస్థాయిలో పా డయ్యాయని, మరమ్మతులు చేపట్టేలా ఆర్‌అండ్‌బీ, పీఆర్ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, ఎన్నింటి విజయలక్ష్మి, ఎంపీ డీఓ సతీష్, తహసీల్దార్ హేమంత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

సంక్షిప్తంగా...

వృద్ధులకు కంటి పరీక్షలు

లక్కవరపుకోట: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా రెల్లిగౌరమ్మపేటలో ఆప్తాలమిక్ అధికారి సీహెచ్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో 34 మంది వృద్ధులకు బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. 12 మందిని శస్త్రచికిత్సలకు, 22 మందిని కళ్లద్దాలకు ఎంపిక చేశారు. ఆరోగ్య కార్యకర్త కె.వి.రాజు, ఏఎన్ఎం మణి, గౌరి,ఆశ కార్యకర్తలు హేమలత,లక్ష్మి పాల్గొన్నారు.

కొండ చిలువ హతం

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లి హైస్కూల్ ఆవరణలో బుధవారం సుమారు పది అడుగుల కొండ చిలువ హల్‌చల్ చేసింది. పాఠశాల లోకి వస్తున్న విద్యార్థులు కొండ చిలువను చూసి ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. ఉపాధ్యాయులు స్థానికుల సహాయంతో కొండ చిలువను హతమార్చారు. పాఠశాల కొండ ప్రాంతానికి అనుకొని ఉండడంతో పాములు బెడద అధికంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు.


14న బైక్ ర్యాలీ

జామి: అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14వ తేదీన మండలంలో జైభీమ్ ఆధ్వర్యంలో బహుజన యువత చైతన్య బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు బహుజన సంఘం నేతలు తెలిపారు. సంబంధిత కరపత్రాలను మండల కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. బహుజన నేతలు వి.నాగరాజు,జి.చైతన్యకుమార్, గిరిజనుల ఐక్యవేదిక ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ నేతేటి కృష్ణారావు,జై భీమ్ యువత ఎన్.సంతోష్,అప్పలరాజు,కె.రామారావు పాల్గొన్నారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ

చీపురుపల్లి: స్వయం సహాయక సంఘాలు రికార్డులు పక్కాగా నిర్వహించుకునేలా, సకాలంలో రుణాలు చెల్లించేలా చూడడంలో మండల సమాఖ్య కీలక పాత్ర పోషించాలని వెలుగు ఏపీఎం ఎం.వి.రాజశేఖర్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల సభ్యులకు పథకాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంఘాలు చేపట్టబోయే పనులకు సంబంధించి ప్రణాళిక తయారు చేయాలన్నారు.

వ్యక్తి అదృశ్యం



నర్సింగరాజు

శృంగవరపుకోట: బొడ్డవర గ్రామానికి చెందిన ఇందుకూరి నర్సింగరాజు ఇంటి నుంచి బయటికి వెళ్లి పదిహేను రోజులు అయిన తిరిగా రాకపోవడంతో ఆయన తండ్రి బాబ్జీరాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశా రు. ఎస్ఐ తారకేశ్వరరావు చెప్పిన వివరాలు. నర్సింగరాజు గత నెల 28న ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. ఏదో పనిపై వెళ్లుంటాడు వస్తాడని కుటుంబీకులు తొలుత అనుకున్నారు. ఇంటికి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారిని ఆరా తీశారు. అయినా ఆచూకీ తెలియక పోవడంతో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం

బొండపల్లి: రైతులు ఎన్నోఏళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యలకు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం లో భాగం ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూరీసర్వేతో శాశ్వత పరిష్కారం లభించనుందని తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా తెలిపారు. బొండపల్లి పంచాయతీ మధుర గ్రామం చందకపేటలో బుధవారం నిర్వహించిన డ్రోన్ సర్వేను ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు వందేళ్ల తర్వాత రాష్ట్రంలో పూర్తిస్థాయిలో భూరీసర్వేను పక్కాగా చేపడుతున్నట్టు వివరించారు. రైతులంతా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ బండారు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కోళ్ల వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్‌ఓ రవి తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో భాగస్వాములు కండి



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ వెంకటరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): నేటి ఇంజినీరింగ్ విద్యార్థులే భావి ఇంజినీర్‌లు అని, దేశప్రగతిలో మీరంతా భాగస్వాములు కావాలని ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు విద్యార్థులకు సూచించారు. గరివిడిలోని అవంతీ సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన వీసీ వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ అవకాశాల కోసమే చూడకుండా, ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్య అభ్యసించాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి.వంశీమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక ప్రయోగాలకు ఎక్కువ సమయం వెచ్చించాలన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అవంతీ విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ ఎం.లక్ష్మీప్రియాంక, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హాస్టళ్లు, రేషన్‌డిపోల్లో తనిఖీలు



బాలికల హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతూ ఫుడ్ కమిషన్ మెంబర్ కాంతారావు

గజపతినగరం: మండల కేంద్రంలోని పలు వసతి గృహాలు, రేషన్ డిపోలు,ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఫుడ్ కమిషన్ మెంబర్ కాంతారావు బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేశారు. గజపతినగరం బాలుర కళాశాల వసతి గృహంలో సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నట్టు గుర్తించి మెమో జారీ చేశారు. మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌లో సరుకుల నిల్వలకు సంబంధించి బోర్డులు లేకపోవడంతో అక్కడి సిబ్బందికి మెమో జారీ చేశారు. అలాగే రేషన్ సరుకుల పంపిణీ వాహనాలను పరిశీలించారు.

తాడమ్మతల్లి జాతర ఏర్పాట్లపై సమీక్ష

- అధికారులకు పలు సూచనలు చేసిన జెడ్పీ చైర్మన్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని గర్భాంలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న తాడమ్మతల్లి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు సూచించారు. జాతర ఏర్పాట్లపై గర్భాం సచివాలయం వద్ద అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వేలాది మంది భక్తులు వస్తారని, గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పార్వతిని ఆదేశించారు. 24న సిరిమానోత్సవం ఉంటుందని, సిరిమాను ఊరేగించే ప్రాంతాల్లో మాత్రమే ఊరేగింపు సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయాలని, మిగతా ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో ఆటంకం లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. 22వ తేదీ నుంచి 25 వరకు గ్రామంలో పారిశుద్ధ్యపనులు నిరంతం కొనసాగాలని, అలాగే అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని అన్నారు. రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని కూడా జాతర విధులకు వేయాలని మండల అధికారులకు సూచించారు. జాతరకు వచ్చి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జిల్లాపంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా, తహసీల్దార్ బి.రత్నకుమార్, ఎంపీడీఓ పి.రామకృష్ణ, డీపీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, తాడ్డి చంద్రశేఖరరావు, తాడ్డి సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

16న గురుకుల ప్రవేశ పరీక్ష

లక్కవరపుకోట/ దత్తిరాజేరు: జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో 2023-2024 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 16వ తేదీన పరీక్ష నిర్వ హించనున్నారు. ఎల్.కోట మండలం జమ్మాదేవిపేట మహాత్మా జ్యోతిరావు పూలే ఆశ్రమ బాలికల పాఠశాల, దత్తిరాజేరు మండలంలోని కె.కొత్తవలస జ్యోతిబాపూలే బాలు ర గురుకుల పాఠశాల కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాళ్లు యు.విజయ్ కుమార్‌పాత్రో, సీతారాం బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అర్ధగంట ముందు హాజరు కావాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్ చేసుకున్న విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు హాల్ టికెట్లతో పాటు ఆధార్ కార్డులు తీసుకుని రావాలని పేర్కొన్నారు.